గోడు పట్టేదెవరికి?

59వ వార్డులో సమస్యల తిష్ట

వీధిలైట్లు, రోడ్లు లేక ఇబ్బందులు

అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం శూన్యం


గణపతినగర్ కొండ ప్రాంతంలో లైటు లేని విద్యుత్ స్తంభం


గణపతినగర్ కొండ ప్రాంతంలో శిథిలావస్థలో మెట్ల మార్గం

జీవీఎంసీ 59వ వార్డులోని పలు ప్రాంతాలు సమస్యలు తిష్టవేశాయి. కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కనీస వసతులు కల్పించాలని ప్రజలు వినతులు అందజేసినా గోడు పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రధానంగా నెహ్రూనగర్,గణపతినగర్ ప్రాంతాల్లో వీధి లైట్లు,సీసీ మెట్ల మార్గాలు , రోడ్లు ,రక్షణ గోడలు లేక ఆయా ప్రాంత వాసులు అసౌకర్యానికి గురవుతున్నారు. 15 ఏళ్ల కిందటటాయా ప్రాంతాల్లో సీసీ కాలువలు,సీసీ మెట్ల మార్గాలు నిర్మించారు. అయితే ఇవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.నెహ్రూనగర్ కొండ ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో వాడుక నీరు ఇళ్ల ముందే నిలిచిపోతుంది. గణపతినగర్ కొండ ప్రాంతంలో సీసీ మెట్ల మార్గం శిథిలావస్థకు చేరింది.దీంతో రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. గణపతినగర్ కొండ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు లేవు.దీంతో చీకటిపడితే అంధకారం అలముకుంటుంది. రక్షణ గోడలు లేక వర్షాలు పడిన సమయంలో బితుకుబితుకుమంటూ జీవనం సాగిస్తున్నారు.

\- మల్కాపురం


రక్షణ గోడ లేక ప్రమాదం అంచున ఇళ్లు


నెహ్రూనగర్ కొండ ప్రాంతంలో నిలిచిపోయిన మురుగు

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి ములగాడ 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్ -2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములగాడ హౌసింగ్‌కాలనీ,కొత్తనక్కవానిపాలెం,పాతచెక్‌పోస్టు ఏరియా,గాజువాక ఆర్టీసీ డిపో ఏరియా,ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ,హనుమాన్‌నగర్,గణపతినగర్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఐటీ ప్రగతిలో రాజీవ్‌గాంధీ ముద్ర


మాట్లాడుతున్న అనసూయాదేవి

మల్కాపురం: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత దేశాన్ని అభివృద్ధి చేయడానికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు నిరుపమానమైనవి అని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు.వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువకులకు అపార అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక సంస్థల ప్రగతికి, కంప్యూటర్ రంగ పురోభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, విప్ గణబాబు

గోపాలపట్నం:జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లోని టిడ్కో ఇళ్లను పుపాలక శాఖా మంత్రి నారాయణ, ప్రభుత్వ విప్ గణబాబు బుధవారం సాయంత్రం సందర్శించారు. ఇళ్ల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వచ్చే విజయదశమికి నాటికి ఇక్కడి టిడ్కో ఇళ్ల 50 శాతం అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇక్కడి ఇళ్ల నిర్మాణాలు ఏవిధంగా జరిగాయో ఆరా తీశారు. ఇంకా ఎంత మేర పనులు పెండింగ్ ఉన్నాయి. ఎప్పటిలోగా పనులు పూర్తి అవుతాయన్న అంశాలను అధికారులతో చర్చించారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవనంలోని మహిళా సిబ్బందికి నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. విజేతగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, రమా దుర్గ టీమ్ నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎస్.సునీత, వై.శివకుమారి, పి.దీపిక టీమ్, తృతీయ స్థానంలో సిహెచ్.జ్యోతికుమారి, మమత టీమ్‌లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలను రిజిస్ట్రార్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

24న క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక: లీ ఫార్మాలో ఉద్యోగాల భర్తీకి టీఏస్నార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈనెల 24న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. బీఎస్సీ ఎంపీసీ, సీబీజెడ్, సీఎంబీబీటీ, సీబీసీబీటీ విద్యార్థులు, ఎమ్మెస్సీ ఆర్గానిక్, ఎనలిటికల్ కెమిస్ట్రీ విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

ఉప్పొంగిన గెడ్డ


మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం ఎదురుగా రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం ఎదురుగా గల గెడ్డ పొంగింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి గెడ్డలో ప్రవాహం అధికమై ఉమురుగునీరు సర్వీసు రోడ్డుపైకి చేరింది.వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు ఇక్కడ గెడ్డలో భారీగా నిలిచిపోతున్నాయి. సకాలంలో గెడ్డలో వ్యర్థాలు తొలగించకపోవడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక గెడ్డ పొంగి ఇక్కడ సేవామారాంగ్పై నిలిచిపోతుంది. మురుగునీరు సర్వీసు రోడ్డులో నిలిచిపోవడంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం కనులపండువగా జరిపించారు. ఆలయ బేడామండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో నిర్వహించిన వేడుకలో స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి అనంతరం హారతి ఇచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

బౌద్ధ దార్శనికుడు అశ్వఘోషుడు


ప్రసంగిస్తున్న పిల్లా రమణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో 'అశ్వఘోషుడు, బుద్ధ చరితం' అనే అంశంపై విశ్రాంత తెలుగు అధ్యాపకుడు పిల్లా రమణమూర్తి ప్రసంగించారు. క్రీ.శ.80–150 మధ్య కాలానికి చెందిన అశ్వఘోషుడు బౌద్ధ దార్శనికుడు, మహాకవి, నాటకకర్తని తెలిపారు. బౌద్ధ ధర్మాన్ని ప్రజలకు ప్రచారం చేయడానికి అశ్వఘోషుడు తన కవిత్వాన్ని సాధనంగా చేసుకున్నాడని పేర్కొన్నారు. అతను రచించిన గ్రంథాల్లో బుద్ధ చరిత, సౌందరనందం అనే రెండు మహా కావ్యాలు, సారిపుత్ర ప్రకరణం అనే నాటకం, వజ్రసూచి అనే బౌద్ధ ధర్మ గ్రంథం ముఖ్యమైనవన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సంస్కృతంలో గౌతమ బుద్ధుడి జీవిత చరిత్రను సమగ్ర సుందరంగా రచించిన వ్యక్తి అశ్వఘోషుడని కొనియాడారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కేవీఎస్ మూర్తి, సిహెచ్.చిన సూర్యారాయణ, చల్లా రాంబాబు, కొత్తూరు రమణ, సోమంచి వినయ భూషణరావు, బి.రాధారాణి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ శిక్షణ


శిక్షణ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లతో నేవీ అధికారులు


శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

అల్లిపురం: యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఏవీఎన్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. త్రీ ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో నడుస్తున్న శిక్షణ శిబిరం ఈ నెల 13వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగుతుంది. శిక్షణలో భాగంగా క్యాడెట్లు వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. బోట్ పుల్లింగ్, సిమ్యులేటర్ ద్వారా కాల్పులు, రైఫిల్ షూటింగ్, టెంట్ పిచింగ్, డ్రిల్, రైఫిల్ డ్రిల్ సీమాఫోర్ వంటి అంశాలు నేర్చుకున్నారు. సివిల్ డిఫెన్స్ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఎమర్జెన్సీ వైద్య సేవలు, సైబర్ సెక్యూరిటీ అవగాహన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కాలేజీలో ఉన్న బోటనీ, జువాలజీ మ్యూజియంలను క్యాడెట్లు సందర్శించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా క్యాంపు పరిసరాలను శుభ్రం చేశారు. ఆల్ ఇండియా సైనిక్ కాంపిటీషన్ 2025 కోసం శిక్షణ అందజేశారు. బుధవారం బడా ఖానాతో ఈ క్యాంపు ముగిసింది. వివిధ పాఠశాలలు, కాలేజీల నుంచి వచ్చిన క్యాడెట్లు పాల్గొన్నారు.

కుమ్మరించిన వాన


బాజీ జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్‌రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో బుధవారం వర్షం కుమ్మేసింది. మంగళవారం రాత్రి నుంచి కురిసిన వానతో ఈ ప్రాంతమంతా తడిసి ముద్దయింది. బుధవారం ఉదయం నుంచి మబ్బులు ఉండడంతో ప్రజలు సేదతీరారు. చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం జోరందుకుంది. సాయంత్రం ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పాదచారులు, వాహన చోదకులు గొడులను ఆశ్రయించారు. గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారిలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోయి చెరువును తలపించింది. కొత్తపాలెం వెళ్లే దారిలో నీరు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే పాతగోపాలపట్నం, చంద్రనగర్ వద్ద అండర్ పాస్ వేల్లో వర్షపునీరు భారీగా చేరడంతో ఇబ్బందులు పడ్డారు.

వర్షంతో అగచాట్లు

విశాఖ విద్య: వర్షంతో ప్రజలు అగచాట్లు పడ్డారు. ఎన్ఏడీ ప్రాంతంలోని రహదారులు జలమయమయ్యాయి. ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో మెకాళ్ల లోతులో వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ప్రయాణానికి ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలను వ్యర్థాలు కప్పేయడంతో నీరుపోయే మార్గం లేక రోడ్డుపైకే మురుగు నీరంతా చేరింది. ఎన్ఏడీ చుట్టు పక్కల కాలనీల్లో ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో దుర్వాసనతో ప్రజానీకం అసౌకర్యానికి గురయ్యారు. జీవీఎంసీ 52వవార్డు రిక్షా కాలనీలో డ్రైనేజీ నీరు పైకి ఉబికివచ్చింది. అదే విధంగా 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ఓ ఇంటి వద్ద గోడ కూలింది. ఎగువ ప్రాంతం నుంచి ఒక్కసారిగా నీరు పొంగి రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పారిశుధ్య సిబ్బంది అక్కడికి చేరుకొని డ్రైనేజీలో చెత్త తొలగించి నీరు కిందకు పోయేలా ఏర్పాట్లు చేశారు. చిన్నపాటి వర్షాలకే ఇలాంటి పరిస్థితులు ఎదురైతే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


52వ వార్డు రిక్షా కాలనీలోఉబికి వస్తున్న డ్రైనేజీ


కొత్తపాలెం వెళ్లే దారిలో కురుస్తున్న వర్షం


గోపాలపట్నం బస్ స్టాప్ వద్ద నిలిచిపోయిన వర్షపునీరు


90వ వార్డు లక్ష్మీనగర్‌లో కూలిన గోడ


గోపాలపట్నం రోడ్డులో కురుస్తున్న వర్షం

కార్మిక సమ్మెపై ప్రభుత్వ నిర్బంధం తగదు


జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

దాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై కూటమి ప్రభుత్వం నిర్బంధం ఆపాలంటూ కమ్యూనిస్టులు బుధవారం జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహ్మాన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కులోని 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అమానుషంగా తొలగించిందన్నారు. మరో 2,600 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని ఆరోపించారు. వేల సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులను అర్థంతరంగా రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. కార్మికుల ఉపాధిని కాపాడి, వారి కుటుంబాలను ఆదుకోవల్సిన రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నిరవధిక సమ్మె విచ్ఛిన్నానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు కుట్రలు కొనసాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి వత్తాసు పలకడమేనన్నారు. వేల సంఖ్యలో కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్ నోరు మెదపకపోవడం కార్మికులు, వారి కుటుంబాలకు ద్రోహం చేయడమేనన్నారు. కార్యక్రమంలో బి. జగన్, దేవసహాయం, కె. చంద్రశేఖర్, పి. మణి, మన్మథరావు, బి. ఈశ్వరమ్మ, ఎం. సుబ్బారావు, పి. పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: అలనాటి మేటి నటులు చంద్రమోహన్, రంగనాథ్ నటించిన చిత్రాల్లోని పాటలను నగరానికి చెందిన గాయనీ గాయకులు మృదు మధురంగా ఆలపించి అలరించారు. సత్య సుమధుర స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను ఉర్రూత లూగించింది. గాయనీ గాయకులు పి.బి.ఖాన్, లక్ష్మీస్వరూప, మాధురి, గంటి ఉష, శోభారాణి, రంజిత, పెమ్మరాజు రామ్, కె.ఎల్.రావు, శంకర్, నాయుడు పలు సినీ గీతాలు పాడి ఆకట్టుకున్నారు. రా దిగిరా.. భువికి దిగిరా శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరిలో అలనాటి మేటి తెలుగు, హిందీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు, సన్‌మూర్తి, సత్యవతి ఖాన్, రాజేశ్వరి పాల్గొన్నారు.

శక్తి యాప్ డౌన్‌లోడ్‌కు స్పెషల్ డ్రైవ్



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

గోపాలపట్నం: శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు గోపాలపట్నం పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేట్టారు. సీపీ ఆదేశాల మేరకు పలు చోట్ల శక్తి యాప్ డౌన్ లోడ్ చేసుకోవడం.. ఏవిధంగా వాడాలి అన్న అంశాలను పౌరులకు వివరిస్తున్నారు. ఎక్కడైనా ఆకతాయిల వల్ల ఇబ్బందులు ఏర్పడితే వెంటనే ఈ యాప్‌ద్వారా సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద బుధవారం పలువురు ప్రయాణికుల చేత యాప్ డౌన్‌లోడ్ చేయించిన పోలీసులు ఎలా వినియోగించాలో అవగాహన కల్పించారు. గతంలో దిశా యాప్ ఉంటే అది ఇప్పుడు శక్తి యాప్‌గా ఆటోమెటిక్‌గా అప్‌డేట్ అయి శక్తి యాప్‌గా మారితుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు జయేంద్రకాలనీలోని పాత రామాలయం వాటర్ ట్యాంక్ జంక్షన్ వద్ద సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు బుధవారం వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు అనుమతులు లభించాయన్నారు. దశల వారీగా పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. .